
సాక్షి ఒడిశా

సోమవారం । 24 । మార్చి । 2025



శ్రీ మందిరం ఆదాయం లెక్కింపు
నగదు : రూ. 10,80,179
బంగారం : 17 గ్రాముల 220 మిల్లీ గ్రాములు
వెండి : 38 గ్రాముల 700 మిల్లీ గ్రాములు
- భువనేశ్వర్/పూరీ

అలరించిన పోటీలు

రాయగడలో ఉగాది ఉత్సవాలు ఆకట్టుకున్నాయి. తెలుగువారు పాల్గొన్నారు.

- 8లో





రక్తదానం..ప్రాణదానం

రెండుచోట్ల రక్తదాన శిబిరాలు జరిగాయి. 60 యూనిట్లకుపైగా సేకరించారు.

- 8లో

న్యూస్‌రీల్

సిక్కిం కాంగ్రెస్ నేతలతో కొరాపుట్ ఎంపీ చర్చలు



గ్యాంగ్‌టక్‌లో పర్యటిస్తున్న కొరాపుట్ ఎంపీ సప్తగిరి ఉల్క

కొరాపుట్: సిక్కిం కాంగ్రెస్ పార్టీ నేతలతో కొరాపుట్ పార్లమెంట్ సభ్యుడు సప్తగిరి ఉల్క చర్చలు జరిపారు. సిక్కిం రాష్ట్ర రాజధాని గాంగ్‌టక్‌లో సిక్కిం ప్రదేశ్‌కాంగ్రెస్ కార్యాలయాన్ని సప్తగిరి ఆదివారం సందర్శించారు. ఆ రాష్ట్రంలోని కాంగ్రెస్ సహచర విభాగాల నాయకులతో భేటీ అయ్యారు. ఎంపీ సప్తగిరిని కాంగ్రెస్ పార్టీ అధిష్టానం ఈశాన్య రాష్ట్రాల పార్టీ పరిశీలకుడిగా నియమించింది. దీంతో సప్తగిరి తొలిసారిగా సిక్కింలో పర్యటిస్తున్నారు.

మజ్జిగ, పుచ్చకాయల వితరణ



మజ్జిగ, పుచ్చకాయలను అందజేస్తున్న కామేశ్వరరావు

రాయగడ: పెరుగుతున్న ఎండలను దృష్టిలో పెట్టుకుని స్థానిక సాయిప్రియ వెల్ఫేర్ ట్రస్టు ఆధ్వర్యంలో తుంబిగుడ కూడలిలో బాటసారులకు మజ్జిగ, పుచ్చకాయలను ఆదివారం వితరణ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అటవీశాఖ రాయగడ రేంజర్ కామేశ్వర్ ఆచారి హాజరై బాటసారులకు మజ్జిగ, పుచ్చకాయలను పంపిణీ చేశారు. ఈ తరహా సేవా కార్యక్రమాలు తరచూ నిర్వహించాలని ట్రస్టు సభ్యులను సూచించారు. ట్రస్టు కార్యదర్శి దయానిధి ఖండగ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సభ్యులు జి.బ్రహ్మజీ, లాడి చంద్రమౌళి, సన్యాసి పాణిగ్రాహి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర మంత్రుల కాన్వాయ్‌పై రాళ్ల దాడి


- కానిస్టేబుల్‌కు గాయాలు
- మయూర్‌భంజ్ జిల్లాలో సంఘటన



గ్రామస్తుల దాడిలో అద్దాలు పగిలిన మంత్రి కారు

భువనేశ్వర్: మయూర్‌భంజ్ జిల్లాలో రాష్ట్ర మంత్రులకు చేదు అనుభవం ఎదురైంది. ఈ జిల్లా బంగిరిపోషి ప్రాంతం కాల వైశాఖి వైపరీత్యంతో భారీగా ప్రభావితమైంది. ప్రాంతీయుల్ని పరామర్శించి నష్టం తీవ్రతని క్షేత్ర స్థాయిలో ప్రత్యక్షంగా సమీక్షించేందుకు ఇరువురు మంత్రులు బయల్దేరారు. వీరిలో రాష్ట్ర రెవెన్యూ, విపత్తు నిర్వహణ విభాగం మంత్రి సురేష్ కుమార్ పూజారి, గృహ నిర్మాణం, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి కృష్ణచంద్ర మహాపాత్రో ఉన్నారు. కాల వైశాఖి వైపరీత్యం నష్టాన్ని అంచనా వేయడానికి ఆదివారం ఇద్దరు మంత్రులు చేసిన పర్యటన ఉద్రిక్తంగా మారింది. వీరి రాకలో జాప్యం కారణంగా స్థానిక ప్రభావిత వర్గాలు ఆగ్రహంతో నిరసనలు చేపట్టి వారి కాన్వాయ్‌పై దాడి చేశారు. ఈ సందర్భంగా రాళ్లు రువ్వడంతో మంత్రుల కారు అద్దాలు పగిలాయి. ఒక కానిస్టేబుల్ గాయపడ్డాడు. నష్టం అంచనా క్షేత్ర స్థాయి పర్యటన ముగించుకుని తిరిగి వెళ్తుండగా స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కాల వైశాఖి వైపరీత్యానికి గురైన పలు ప్రాంతాల్ని సందర్శించకుండా వెనుదిరగడంతో ఆగ్రహించిన వర్గం ఈ దాడికి పాల్పడినట్లు సమాచారం. మంత్రుల పక్షపాత వైఖరి పట్ల ప్రభుత్వం బదులు ఇవ్వాలని ఆందోళనకు దిగిన గ్రామస్తులు నిరసన ప్రదర్శించారు. ఈ దాడిలో ఒక పోలీసు కానిస్టేబుల్ తలకు గాయమైంది. వాహనాలపై రాళ్ల వర్షం కురిపించారు. భద్రతా సిబ్బంది సకాలంలో పరిస్థితిని అదుపులోకి తీసుకోవడంతో పరిస్థితి కుదుటపడింది.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం స్వాధీనం



తోపుడు బండిపై మృతదేహం

రాయగడ: ఒక గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని మునిగుడ పోలీసులు ఆదివారం రైల్వే స్టేషన్ సమీపంలోని తోపుడు బండిపై స్వాధీనం చేసుకున్నారు. కొంత మంది అటువైపుగా వెళుతున్న సమయంలో మృతదేహాన్ని చూసి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. మృతుని వివరాలు తెలియాల్సి ఉంది.

కాల వైశాఖి పరిహారంపై హామీ



పునరుద్ధరణ కార్యకలాపాల్లో తలమునకలైన సహాయక, విపత్తు నిర్వహణ సిబ్బంది



శిథిలావస్థకు చేరిన ఇల్లు



చెదిరిన పూరిళ్లు



బంగిరిపోషి ప్రాంతంలో నేలకు రాలిన భారీ వడగండ్లు

భువనేశ్వర్: రాష్ట్రంలో మయూర్‌భంజ్ జిల్లాలో కాల వైశాఖి (గాలి వాన) విధ్వంసం సృష్టించింది. వివిధ ప్రాంతాల్లో గూడు చెదిరి పలువురు ప్రజలు తలదాచుకోలేని దయనీయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. ఈ పరిస్థితుల్లో పీడిత ప్రజలకు తక్షణమే పరిహారం అందిస్తామని రాష్ట్ర ప్రభుత్వం హామీ ఇచ్చింది. ఈ ప్రాంతంలో 400కి పైగా ఇళ్లు దెబ్బతిన్నాయి. మయూర్‌భంజ్ జిల్లాలో బంగిరిపోషి ప్రాంతం భారీగా దెబ్బతింది. ఈ ప్రాంతంలో కాల వైశాఖి తుఫాను వల్ల జరిగిన నష్టాన్ని రాష్ట్ర రెవెన్యూ, విపత్తు నిర్వహణ శాఖ మంత్రి సురేష్ కుమార్ పూజారి ఆదివారం ప్రత్యక్షంగా అంచనా వేశారు. ఈ సందర్భంగా, బాధిత వర్గాలకు నష్టాలకు పూర్తి ఆర్థిక పరిహారం అందుతుందని మంత్రి హామీ ఇచ్చారు.

ఆన్‌లైన్‌లో పరిహారం చెల్లింపు

క్షేత్ర స్థాయిలో కాల వైశాఖి నష్టం నివేదికను ఖరారు చేసిన ప్రకారం ఆదివారం సాయంత్రం నాటికి బాధితులకు పరిహార నిధులు అందుతాయి. తక్షణ సహాయ చర్యలో భాగంగా ఈ మొత్తం ఆన్‌లైన్‌లో బాధితుల ఖాతాలకు ప్రత్యక్షంగా బదిలీ అవుతాయని మంత్రి వివరించారు. ఆధార్‌తో అనుసంధానించిన బ్యాంకు ఖాతాలకు మాత్రమే ఇది సాధ్యం అవుతుంది. లేని వారికి ప్రత్యక్షంగా నగదు రూపంలో పరిహారం చెల్లించడం జరుగుతుందని స్పష్టం చేశారు.

19 పంచాయతీల్లో విధ్వంసం

వాస్తవానికి మయూర్‌భంజ్ జిల్లాలో గత రెండు రోజులుగా కాల వైశాఖి విధ్వంసం సృష్టిస్తోంది. ప్రధానంగా బంగిరిపోషి, బిషోయ్, కులియానా, సారాసాకొనా మరియు కరంజియా మండలాల్లో విస్తృత విధ్వంసం సృష్టించింది. జిల్లాలో 19 పంచాయతీల్లో 400 కి పైగా ఇళ్లు దెబ్బతిన్నాయి. పలు చోట్ల ఇళ్లు శిథిలావస్థకు చేరుకున్నాయి. అనేక కుటుంబాలు నిరాశ్రయులై ఇబ్బందులకు గురవుతున్నారు. బాధితుల బాగోగుల్ని ప్రత్యక్షంగా పర్యవేక్షించేందుకు స్థానిక సీనియర్ రెవెన్యూ అధికారులు బాధిత ప్రాంతాల్లో సందర్శించి సత్వర సహాయం అందజేసేందుకు ఆదేశాలు జారీ చేశారు. ప్రభావిత ప్రాంతాల్లో స్థానిక అధికారులు, విపత్తు ప్రతిస్పందన బృందాలతో కలిసి, సాధారణ స్థితిని పునరుద్ధరణకు యుద్ధ ప్రాతిపదికన ప్రయత్నాలను కొనసాగిస్తున్నారు. జిల్లా యంత్రాంగం సహాయ కార్యకలాపాలను సమన్వయం చేస్తుంది. అవసరమైన వారికి ఆహారం, తాత్కాలిక ఆశ్రయం వంటి ప్రాథమిక సౌకర్యాలు కల్పించేలా చూస్తోంది.

● ఆఖరి చూపు కోసం..



కెనాల్ వద్ద కుమారుని ఆచూకీ కోసం ఎదురు చూస్తున్న గౌరీశంకర్

జయపురం: జయపురం సతిగుడ కెనాల్ ఎల్లో డేమ్ వద్ద కెనాల్‌లో పడిన కుమారుడి ఆఖరి చూపు అయినాదక్కాలని తండ్రి మూడు రోజులుగా ఎదురు చూస్తున్నారు. జయపురం మహారాణిపేట్ రాందాస్ లైన్ నివాసి పి.గౌరీశంకర్ చిన్న కుమారుడు పి.నిఖిలేష్(17) సతిగుడ నది ఎల్లో డేమ్ సమీపంలో గల కెనాల్‌లో ఆత్మహత్య చేసుకున్నట్లు అనుమానిస్తున్నారు. తండ్రి గౌరీశంకర్ తన కుమారుడు కెనాల్‌లో పడి కనిపించలేదని పోలీసులకు, అగ్నిమాపక విభానికి తెలియజేశారు. కెనాల్ వద్ద నిఖిలేష్ వస్తువులు ఉన్నాయి. వారు వచ్చి ఎంత గాలించినా ఏమీ దొరకలేదు. నిఖిలేష్ ఆత్మహత్య చేసుకున్నాడని తండ్రి గానీ, ఉపాధ్యాయులు గానీ నమ్మడం లేదు. కుమారుడి మృతదేహమైనా దొరుకుతుదని తండ్రి గౌరీశంకర కెనాల్ వద్ద ఆశగా ఎదురు చూడటం కనిపించింది. నిఖిలేష్ గత ఏడాది పరీక్షల్లో 95 శాతం మార్కులు తెచ్చుకున్నాడు. గౌరీశంకర్ భార్య కొద్ది రోజుల కిందట మృతి చెందారు. ఇప్పుడు చిన్నకొడుకు కాలువలో గల్లంతైపోయాడు. ఆఖరి చూపైనా దక్కాలని కళ్లు కాయలు కాసేలా తండ్రి ఎదురు చూస్తున్నాడు.

27న విధాన సభ ముట్టడికి సన్నద్ధం



ప్రసంగిస్తున్న జిల్లా ఉపాధ్యక్షుడు బినోద్ మహాపాత్రో

జయపురం: రాష్ట్రంలో అధికార బీజేపీ చర్యలను ఖండిస్తూ ఈ నెల 27న విధాన సభ ముట్టడికి కాంగ్రెస్ పిలుపునిచ్చిందని ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి వెల్లడించారు. స్థానిక బాబా సాహేబ్ కల్యాణ మండపంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు శశిభూషణ పాత్రో అధ్యక్షతన జరిగిన సమావేశంలో బాహిణీపతి ప్రసంగిస్తూ బీజేపీ పాలకులపై నిప్పులు చెరిగారు. రాష్ట్రంలో మహిళలపై అత్యాచారాలు రోజు రోజుకు పెరుగుతున్నాయని, అందుకు ముఖ్యమంత్రి సభకు సమాధానం చెప్పాలని తాను డిమాండ్ చేసినందుకు బిజేపి ఎం.ఎల్.ఎ జయనారాయణ మిశ్ర తన పై దాడి చేశారని వెల్లడించారు. బీజేపీ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పేందుకు కొరాపుట్ జిల్లా నుంచి వేలాది మంది పార్టీ కార్యకర్తలు ఈ నెల 27న విధాన సభ ముట్టడిలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. అధికార పార్టీ మంత్రులను, నేతలను కొరాపుట్ జిల్లాలోనికి అనుమతించకూడదని నేతలు పిలుపునిచ్చారు. ప్రసంగించిన వారిలో రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు మీనాక్షి బాహిణీపతి, ఒడిశా కాంగ్రెస్ ప్రభారీ రజనీ మహంతి, కొరాపుట్ జిల్లా కాంగ్రెస్ పర్యవేక్షకులు అజిత్ దాస్‌తో పాటు కొరాపుట్ జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడు బినోద్ మహాపాత్ర, కోశాధి కారి నిహారంజన్ బిశాయి తదితరులు ఉన్నారు.

పతాకంపై కాలవైశాఖి ప్రభావం



ఆది వారం వేకువ జామున ఒకే సమయంలో రెండు వేర్వేరు దిశల్లో రెపరెపలాడిన పతిత పావన పతాకం, ఛువుణి మఠం పతాకం



సాధారణ పరిస్థితుల్లో నీలచక్రంతో ముడి పడిన పతిత పావన పతాకం రెపరెపలు

భువనేశ్వర్: పూరీ శ్రీ జగన్నాథుని ఆలయం శ్రీ మందిరం శిఖరాన ఆదివారం వేకువ జామున వింత పరిస్థితి తారసపడింది. శ్రీమందిరం శిఖరాన నీలచక్రంతో ముడి పడి ఉన్న పతిత పావన పతాకం ఎగిరే దిశ మారింది. అదే సమయంలో నీల చక్రం దిగువన ముడి వేసిన ఛవుణి మఠం పతాకం కొంత సమయం పతిత పావన పతాకానికి భిన్న దిశలో రెపరెపలాడింది. గాలి ఎగువ భాగంలో ఒక దిశలో, దిగువ భాగంలో మరో దిశలో వీచినట్లు స్పష్టమవుతోంది. ఆదివారం వేకువజామున కాల వైశాఖి ప్రభావం కారణంగా పతాకాలు విపరీత దిశలో ఎగిరాయని పేర్కొంటున్నారు.

భగత్ సింగ్ సేవలు స్ఫూర్తిదాయకం



సభలో పాల్గొన్న కార్మికులు

జయపురం: దేశ విముక్తి కోసం ప్రాణాలను చిరు నవ్వుతో అర్పించిన విప్లవ వీరులు సహీ ద్ భగత్ సింగ్, శుఖ్‌దేవ్, రాజగురు నిజమైన దేశ భక్తులని వక్తలు అన్నారు. స్థానిక యాదవ భవనంలో ప్రముఖ కార్మిక నేత ప్రమోద్ కుమార్ మహంతి అధ్యక్షతన భగత్ సింగ్, శుఖ్‌దేవ్, రాజగురు వర్ధంతిని నిర్వహించారు. భగత్ సింగ్‌ను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. భగత్ సింగ్, శుఖ్‌దేవ్, రాజగురు చిత్రపటాలకు నివాళులర్పించారు. కొరాపుట్ జిల్లా కమ్యూనిస్టు పార్టీ కార్యదర్శి జుధిష్టర్ రౌళో, సహాయ కార్యదర్శి రామకృష్ణ దాస్, ప్రమోద్ కుమార్ తివారీ, అలేక్ పాత్రో, కె.సత్యనారాయణ పాల్గొన్నారు.

ప్రహసనంగా ఎంజీ రోడ్డు విస్తరణ



డ్రైనేజీ కాలువలు తవ్వుతున్న బుల్డోజర్లు



రోడ్డు మధ్యన ఉన్న విద్యుత్ స్తంభం

జయపురం: జయపురం మహాత్మాగాంధీ రోడ్డులో ట్రాఫిక్ సమస్యను నియంత్రించేందుకు రోడ్డు విస్తరణకు గత నవంబర్‌లో శ్రీకారం చుట్టారు. 40 అడుగుల రోడ్డు ఏర్పాటు లక్ష్యంగా రోడ్డుకు ఇరువైపులా 40 అడుగుల లోపున గల దుకాణాలను, ఇళ్లను కొలతలు కొలిచి ఆక్రమణలను బుల్డోజర్లతో తొలగించారు. రోడ్డు వెడల్పు అయి ట్రాఫిక్ సమస్య తీరుతుందని ప్రజలు సంతోషించారు. అయితే 2024 నవంబర్ నెలలో ఆక్రమణలను తొలగించిన అధికారులు, నాలుగు నెలలు గడిచినా వాటిని పట్టించుకోలేదు. అందువల్ల అటు వ్యాపారులు ఇటు ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ఇప్పుడు మార్చ్ 23న రోడ్డుకు ఇరువైపులా కాలువల తవ్వకాలు ప్రారంభించారు. ఈ తవ్వకాలు ఎంజీ రోడ్డు కమలా మెడికల్ కూడలి నుంచి జైలు రోడ్డు జంక్షన్ వరకు రోడ్డు బ్లాక్ చేసి కాలువల తవ్వకాలు జరుపుతున్నారు. విస్తరణ ఎప్పటికి పూర్తవుతుందోనని స్థానికులు అంటున్నారు. విస్తరణ పనులు యుద్ధ ప్రాతిపదిన జరపాలని ప్రజలు కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో అన్నాచెల్లెళ్లకు తీవ్ర గాయాలు



బైక్‌ను ఢీకొట్టిన టిప్పర్



ప్రమాద స్థలంలో గాయాలతో పడి ఉన్న అన్నాచెల్లెళ్లు

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా మల్కన్‌గిరి సమితి సింద్రీమాల పంచాయతీ బందుగూడ గ్రామం వద్ద ఆదివారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో అన్నాచెల్లెళ్లు గాయపడ్డారు. మల్కన్‌గిరి నుంచి ఏదో పని చూసుకుని తిరిగి బైక్‌పై ఇంటికి వెళ్తున్న వారిని ఓ టిప్పర్ బలంగా ఢీకొట్టింది. ఉడాపా గ్రామానికి చెందిన జగన్నాథ్ కాబాసి అతని చెల్లి హిరామాణి కబాసిలు మల్కన్‌గిరికి వచ్చారు. పని ముగించుకుని తిరిగి ఇంటికి వెళ్తుండగా టిప్పర్ ఢీకొట్టింది. టిప్పర్ డ్రైవర్ వెంటనే వారిని స్థానికుల సాయంతో మల్కన్‌గిరి ప్రభుత్వాస్పత్రికి తరలించి, పోలీసులకు లొంగిపోయాడు. మల్కన్‌గిరి ఐఐసీ రీగాన్‌కీండో కేసు నమోదు చేసి రెండు వాహనాలను స్వాధీనం చేసుకున్నాడు.

హత్య కేసులో ముగ్గురు అరెస్టు



అరెస్టయిన నిందితులు

రాయగడ: జిల్లాలోని కాసీపూర్ పోలీస్‌స్టేషన్ పరిధి సిరిపాయి పంచాయతీ బహరుదులుకి గ్రామంలో ఇటీవల ఓ యువకుడు హత్యకు గురయ్యాడు. ఈ కేసులో ముగ్గురిని శనివారం రాత్రి అరెస్టు చేశామని పోలీసులు వెల్లడించారు. అరెస్టయిన వారిలో హత్యకు గురైన యువకుడి భార్య సరస్వతి హలువ, మామయ్య సాధునాయక్, బావమరిది అజయ్ నాయక్‌లు ఉన్నారన్నారు. ఈ కేసుకు సంబంధించి పోలీసులు తెలియజేసిన వివరాల ప్రకారం.. కొరాపుట్ జిల్లా లక్ష్మీపూర్ సమితి పిపిల పాదొరో పంచాయతీలోని లులుపాదొరో గ్రామానికి చెందిన కుమార స్వామి హలువ (40) తన అత్తవారు ఉంటున్న బహరుదులుకి గ్రామానికి వెళ్లాడు. శుక్రవారం రాత్రి అతని భార్య సరస్వతితోపాటు తండ్రి , అన్నయ్య సహాయంతో అత్యంత దారుణంగా కుమార స్వామి హలువను హత్య చేసి గ్రామానికి సమీపంలోని పొదలర్లో మృతదేహాన్ని పడేశారు. అ తరువాత ఏమీ తెలియనట్టు ఇంటికి వెళ్లిపోయారు. శనివారం అటువైపుగా బహిర్భూమికని వెళ్లిన కొందరు మృతదేహాన్ని చూసి పోలీసులకు సమాచారం అందించారు. దర్యాప్తు చేపట్టిన పోలీసులు హత్యకు సంబంధించి నిందితులను గుర్తించి అరెస్టు చేశారు. ఇదిలాఉండగా కొన్నాళ్లుగా భార్య, భర్తల మధ్య కుటుంబ కలహాలు కొనసాగుతున్నాయి. తరచూ ఇద్దరి మధ్య తగాదాలకు విరక్తి చెందిన సరస్వతి తన భర్తను విడిచి తల్లిదండ్రుల ఇంటికి వచ్చేసింది. తన భార్యను తిరిగి ఇంటికి తీసుకువెళ్లేందుకు వచ్చిన కుమార స్వామిని పథకం ప్రకారం భార్య, బావమరిది, మామయ్యలు హత మార్చారు. ఈ విషయాన్ని పోలీసులు ముందు నిందితులు అంగీకరించారు. నిందితులను కోర్టుకు తరలించారు.

రాయగడలో ఉగాది ఉత్సవాలకు సన్నాహాలు



పూజా కార్యక్రమంలో పాల్గొన్న పట్టణ ప్రముఖులు

రాయగడ: పట్టణంలో ఈ ఏడాది ఉగాది ఉత్సవాలు పోటీపోటీగా నిర్వహించేందుకు సన్నాహాలు ప్రారంభమయ్యాయి. రాజ్యసభ మాజీ ఎంపీ నెక్కంటి భాస్కరరావు నేతృత్వంలో రాయగడ జిల్లా ఉగాది ఉత్సవ కమిటీ పేరిట 12 ఏళ్లుగా ఉగాది ఉత్సవాలు నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. అయితే రెండేళ్ల క్రితం యాల్ల కొండబాబు నేతృత్వంలో రాయగడ జిల్లా ఉత్కళ తెలుగు సమాఖ్య ఆధ్వర్యంలో వేరేగా ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. దీంతో పట్టణంలో రెండు వేదికల్లో ఉగాది వేడుకలు జరుగుతున్నాయి. కొద్ది రోజుల క్రితం యాల్ల ఉత్కళ తెలుగు సమాఖ్య ఆధ్వర్యంలో ఉగాది ఉత్సవాలను పురస్కరించుకుని స్థానిక కొల్లిగుడ మైదానంలో ముహూర్తపు రాట వేశారు. తాజాగా ఆదివారం స్థానిక తేజస్వీ హోటల్ ఎదురు మైదానంలో నెక్కంటి ఆధ్వర్యంలో ఉగాది వేడుకలకు ముహూర్తపు రాట వేసి ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. కార్యక్రమంలో రాయగడ మున్సిపాలిటీ చైర్మన్ మహేష్ పట్నాయక్, రాఘవ కుముందాన్, శిల్లా జగన్నాథ రావు, ఎస్.త్రినాథరావు తదితరులు పాల్గొన్నారు.

పోటాపోటీగా బ్యానర్లు..

పట్టణం ఉగాది సంబరాల కోసం ముస్తాబవుతోంది. ప్రతి కూడలిలోనూ నిర్వాహకులు ఉత్సవాల బ్యానర్లను ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే తెలుగు సమాఖ్య ఉగాదిని పురష్కరించుకుని పోటీలను నిర్వహిస్తుండగా ఈ నెల 27, 28 తేదీల్లో నెక్కంటి ఆధ్వర్యంలో జరగనున్న ఉగాది ఉత్సవాలకు సంబంధించి వివిధ పోటీలను నిర్వహించేందుకు సన్నాహాలు ప్రారంభించారు.



ముహూర్తపు రాట కార్యక్రమంలో మాజీ ఎంపీ నెక్కంటి

చందాల వసూళ్లు..!

తెలుగు సమైఖ్యత, సంస్కృతికి అద్దం పట్టే ఈ ఉగాది ఉత్సవాలు ఇదివరకు ఒకే వేదికపై నిర్వహించడంతో పట్టణ ప్రజలు ఉత్సవాలను ఆనందిస్తుండేవారు. క్రమేపీ రెండు గ్రూపులుగా జరుగుతుండటంతో చందాలు చెల్లించే విషయంలో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. కొద్ది రోజుల క్రితం ఉగాది ఉత్సవాల కోసం స్థానిక విద్యా సంస్థ యాజమాన్యాన్ని నిర్వాహక సంఘానికి చెందిన వ్యక్తి ఫోన్ చేసి పెద్ద మొత్తంలో చందా చెల్లించాలని ఫోన్ ద్వారా బెదిరించడం వంటి ఘటనలు వైరల్ అవుతున్న నేపథ్యంలో రాజ్యసభ మాజీ ఎంపీ నెక్కంటి స్పందించారు. తెలుగు వారి సమైఖ్యతను చాటి చెప్పే ఈ వేడుకలకు చందాల వసూళ్ల పేరిట బెదిరిస్తుండటం విచారకరమని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా పోలీస్ యంత్రాంగం స్పందించి అటువంటి వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఇష్టపూర్వకంగా ఇస్తే తీసుకోవాలి తప్ప బెదిరింపులకు పాల్పడటం తగదన్నారు.



ప్రధాన కూడలిలో వెలసిన ఉగాది బ్యానర్

క్లుప్తంగా

నూతన కార్యవర్గం ఎన్నిక

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లా ఎక్సైజ్ అధికారి ఆదేశాల మేరకు హెడ్‌కానిస్టేబుల్, కానిస్టేబుళ్ల కార్యవర్గ ఎన్నికలు ఆదివారం నిర్వహించినట్లు శ్రీకాకుళం స్టేషన్ సీఐ ఎం.వి.గోపాలకృష్ణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రిటర్న్ అధికారిగా తనతో పాటు నరసన్నపేట సీఐ ఎస్.వి.రమణ మూర్తి వ్యవహరించినట్లు తెలిపారు. అధ్యక్షులు, జనరల్ సెక్రటరీ, ఇతర కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు చెప్పారు.

ఆదిత్యాలయానికి భక్తుల తాకిడి



సూర్యనమస్కార పూజలు చేయించుకుంటున్న భక్తులు

అరసవల్లి : ప్రత్యక్ష దైవం సూర్యనారాయణ స్వామి ఆలయంలో ఆదివారం భక్తుల రద్దీ కనిపించింది. ప్రత్యేక ఆదివారంతో పాటు వత్సవలస రాజమ్మతల్లి ఉత్సవాల కొనసాగింపు సందర్భంగా ఇతర ప్రాంతాల నుంచి భారీగా భక్తులు తరలివచ్చారు. కొందరు సూర్యనమస్కారాల పూజలు చేయించుకోగా...మరి కొందరు తలనీలాలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఎండ తీవ్రత అధికంగా ఉండడంతో భక్తులు ఇబ్బందులు పడ్డారు. ఆలయ అధికారులు ఏర్పాటు చేసిన టెంట్లుతో పెద్దగా ఉపశమనం కలుగకపోవడంతో భక్తులు విమర్శలకు దిగారు. వీఐపీల పేరిట చాలా మంది ఫేక్ వీఐపీలు దర్శనాలకు వెళ్లడంపై క్యూలైన్లలో భక్తులు అసంతృప్తి వ్యక్తం చేశారు. వివిధ దర్శనాల టికెట్ల విక్రయాల ద్వారా రూ.3,76,300, విరాళాల రూపంలో రూ.1,41,803, ప్రసాదాల విక్రయాల ద్వారా రూ.1.75 లక్షల వరకు ఆదాయం లభించిందని ఆలయ ఈవో వై.భద్రాజీ వెల్లడించారు.

సీఆర్‌పీఎఫ్ జిల్లా సలహాదారుడిగా చందనరావు



శ్రీకాకుళం న్యూకాలనీ: బాలల హక్కుల వేదిక పరిరక్షణ వేదిక(సీఆర్‌పీఎఫ్) జిల్లా సలహాదారుడిగా తమ్మినేని చందనరావు నియమితులయ్యారు. ఈ మేరకు ఆదివారం జాతీయ కన్వీనర్ ఆర్.వెంకటరెడ్డి నియామక పత్రం అందజేశారు. చందనరావు సంతబొమ్మాళి ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో సాంఘికశాస్త్రం ఉపాధ్యాయునిగా పనిచేస్తున్నారు. బాలల హక్కుల పరిరక్షణకు, వారి సంక్షేమానికి జిల్లా కమిటీ చొరవతో చిత్తశుద్ధితో సేవలు అందిస్తానని తమ్మినేని పేర్కొన్నారు. ఈయన నియామకం పట్ల సీఆర్‌పీఎఫ్ రాష్ట్ర ఇన్‌చార్జి డి.ప్రకాష్, రాష్ట్ర కన్వీనర్ గురుగుబెల్లి దామోదరరావు, ప్రధాన కార్యదర్శి షేక్ అరుణ్ తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

గుర్తు తెలియని రైలు ఢీకొని వ్యక్తి మృతి

ఆమదాలవలస: శ్రీకాకుళం రోడ్(ఆమదాలవలస) రైల్వేస్టేషన్ పరిధి ఆమదాలవలస గేటు సమీపంలో ఆదివారం గుర్తు తెలియని రైలు ఢీకొని వ్యక్తి మృతిచెందాడు. జీఆర్‌పీ ఎస్‌ఐ మధుసూదనరావు తెలిపిన వివరాల ప్రకారం .. శ్రీకాకుళం రూరల్ మండలం నైర పంచాయతీ చల్లపేటకు చెందిన కరిమెళ్ల సూరిబాబు(55) ఆమదాలవలస గేటు ప్రాంతంలో వడ్రంగి దుకాణంలో పనిచేస్తున్నాడు. కుటుంబం లేకపోవడంతో అక్కడే ఉంటున్నాడు. ట్రాక్ దాటేందుకు వచ్చాడో, ఇంకేం జరిగిందో తెలియదు గానీ ఆదివారం పట్టాలపై విగతజీవిగా పడి ఉన్నాడు. స్థానికుల సమాచారంతో రైల్వే పోలీసులు మృతదేహాన్ని పరిశీలించారు. అనంతరం శ్రీకాకుళం రిమ్స్‌కు శవ పంచనామా కోసం తరలించారు.

రైలు ఢీకొని యువకుడు మృతి

పొందూరు: పొందూరు రైల్వేగేటు సమీపంలో ఆదివారం అమరావతి రైలు ఢీకొని గుర్తు తెలియని యువకుడు మృతిచెందినట్లు ఆమదాలవలస జీఆర్‌పీ ఎస్‌ఐ ఎం.మధుసూదనరావు తెలిపారు. సుమారు 30 ఏళ్ల గల ఈ యువకుడు పట్టాలు దాటుతుండగా ఈ ఘటన జరిగినట్లు పేర్కొన్నారు. యువకుడు ఎరుపు టీషర్టు, నీలం ప్యాంట్ ధరించాడని, ముఖం గుర్తు పట్టలేని విధంగా మారిందని చెప్పారు. వివరాల కోసం 9493474582 నంబరును సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

శ్రీకూర్మంలో భక్తజన సందోహం



కూర్మనాథాలయం క్యూలైన్‌లో భక్తులు

గార: ఆది కూర్మక్షేత్రం శ్రీకూర్మనాథాలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. సాధారణ భక్తులతో పాటు చిన వత్సవలస రాజమ్మ తల్లి సంబరాల నుంచి తిరుగుపయనమైన వారు కూడా క్షేత్రానికి పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. దీంతో దర్శనాల క్యూలైన్లు కిక్కిరిసి కనిపించాయి. ఆలయ ఇన్‌చార్జి ఈవో జి.గురునాథం పర్యవేక్షించారు. మరోవైపు సరైన పార్కింగ్ స్థలం లేక వాహనదారులకు ఎప్పటిలాగే ఈ వారం కూడా ఇబ్బందులు తప్పలేదు. కారు, ఆటో, బైక్‌లు పెట్టేందుకు స్థలం చూపించకపోయినా ఆశీలు మాత్రం పంచాయతీ పేరిట వసూలు చేస్తుండటంపై పలువురు వాహనచోదకులు అసహనం వ్యక్తం చేశారు.

అలరించిన పోటీలు..

- ఉత్కళ తెలుగు సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహణ



నిర్వాహకులతో పోటీలకు హాజరైనవారు..



ముగ్గుల పోటీల్లో పాల్గొన్న మహిళలు



ఆకట్టుకున్న ముగ్గు



వేద పఠనం పోటీల్లో పాల్గొన్న ఔత్సాహికులు

రాయగడ: ఈ నెల 30, 31 తేదీల్లో రాయగడ జిల్లా ఉత్కళ తెలుగు సమాఖ్య ఆధ్వర్యంలో జరగనున్న ఉగాది ఉత్సవాలను పురస్కరించుకుని స్థానిక మున్సిపాలిటీ టౌన్ హాల్‌లో ఆదివారం రంగోళి, వేద పఠనం పోటీలు నిర్వహించగా అనూహ్య స్పందన లభించింది. సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించేందుకు మూడేళ్లుగా తెలుగు సమాఖ్య ఉగాది ఉత్సవాలను నిర్వహిస్తుంది. ఈ ఏడాది కూడా మహిళలు, పిల్లలకు వివిధ పోటీలను నిర్వహించేందుకు నడుం బిగించింది. ఆదివారం నిర్వహించిన పోటీల్లో భాగంగా రంగోలీ, వేదపఠనం పోటీల్లో పలువురు ప్రతిభ కనబర్చారు. వేదపఠనం జూనియర్ విభాగంలో ప్రథమ బహుమతిని బి.హర్షవర్ధన్, ద్వితీయ బహుమతిని సాయి అశ్రిత, తృతీయ బహుమతిని ఎం.ప్రీతిలు గెలుపొందారు. అలాగే సీనియర్ విభాగంలో మొదటి మూడు స్థానాల్లో సునీత సబర్, సంతోషిణి, కె.లావణ్యలు విజేతలుగా నిలిచారు. రంగోలీ పోటీల్లో మొదటి మూడుస్థానాల్లో ఎన్.సొనాలి, బి.ప్రీతీ, ఎం.పి.ఇందు విజయం సాధించారు. ప్రోత్సాహక బహుమతులను జి.దీప్తి, కె.మధులత దక్కించుకున్నారు. విజేతలకు ఉగాది ఉత్సవాల్లో బహుమతులు అందజేస్తామన్నారు.

రక్తదానం.. ప్రాణదానం



రాయగడ: రక్తదానంలో పాల్గొన్న యువకులు



మల్కన్‌గిరి: రక్తదానం చేస్తున్న యువకుడు

రాయగడ: స్థానిక బాలాజీ నగర్‌లో గల శ్రీకళ్యాణ వేంకటేశ్వర కళ్యాణ మండపంలో డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. 54 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. దాతులు స్వచ్ఛందంగా వచ్చి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. స్థానిక ప్రభుత్వ హాస్పిటల్ బ్లడ్ బ్యాంక్ అధికారి డాక్టర్ గౌతం పటాన్నయక్ పరివేక్షణలో జరిగిన ఈ శిబిరంలో ఆమో ఒడిశా ప్రతినిధి శివప్రసాద్ దొర పాల్గొన్నారు.

మల్కన్‌గిరిలో

మల్కన్‌గిరి: జిల్లా కేంద్రంలో గల కుమిటిగూడ వీధిలో ఉన్న సత్యసాయి మందిరంలో ఆలయ కమిటీ ప్రెసిడెంట్ కె.గోపాల్‌కృష్ణ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. 8 యూనిట్ల రక్తం సేకరించి జిల్లా బ్లడ్ బ్యాంక్‌కు అందజేశారు. మల్కన్‌గిరి సత్యసాయి కమిటీ సభ్యులు కె.క్రిష్ణకుమారి, ఎం.దమయంతి, ఎ.ఉమ, బాలాజీ పట్నాయక్, తదితరులు పాల్గొన్నారు.

శిష్టకరణ సంఘం నూతన కార్యవర్గం



నూతన కార్యవర్గ ప్రతినిధులు

కొరాపుట్: నబరంగ్‌పూర్ శిష్ట కరణ సంఘం నూతన కార్యవర్గం ఎన్నికైంది. జిల్లా కేంద్రంలోని అఖండల మణి దేవాలయ ప్రాంగణంలో ఆదివారం సంఘ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడుగా సతీష్ పట్నాయక్, ఉపాధ్యక్షునిగా కిశోర్ పట్నాయక్, వివిధ విభాగాల కార్యదర్శులుగా మహేశ్వర్ పట్నాయక్, అవని ప్రసాద్ పట్నాయక్, కోసాధికారిగా చంద్ర ఖర్ పట్నాయక్, న్యాయ సలహాదారుడుగా అరవింద పట్నాయక్, సలహాదారులుగా రబి పట్నాయక్, పి.రామ్మూర్తి పట్నాయక్, ప్రసన్న పట్నాయక్ ఎంపికయ్యారు. సంఘ సేవలను జిల్లా వ్యాప్తంగా విస్తరించాలని నిర్ణయించారు.

క్రికెట్ శిక్షణ శిబిరం ప్రారంభం



శిక్షణకు హాజరైన వారితో అతిథులు



వేదికపై టెక్నికల్ డైరెక్టర్ వెంకట్‌రాం తదితరులు



మాట్లాడుతున్న వెంకట్‌రాం



మాజీ మేనేజర్ పప్పు సింగ్‌తో చర్చిస్తున్న వెంకట్‌రాం


మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా కేంద్రం ఛలాన్‌గూఢ గ్రామం వద్ద అండర్-17 క్రికెట్ శిక్షణ శిబిరం ప్రారంభమైంది. దీన్ని భారత్ క్రికెట్ జట్టు మాజీ కోచ్, టెక్నికల్ డైరెక్టర్ వి.వెంకట్‌రాం ఆదివారం సాయంత్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడల్లో గెలుపోటములను సమానంగా తీసుకొని క్రీడాస్ఫూర్తిని చాటాలన్నారు. ధోనీ, సచిన్ టెండుల్కర్, విరాట్ కోహ్లి, గంభీర్ వంటి క్రికెట్ ఆటగాళ్లను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. ఒకప్పుడు వెనుకబడిన జిల్లాగా ఉన్న మల్కన్‌గిరి ఇప్పుడు అన్నిరంగాల్లో ముందు వరుసలో ఉందన్నారు. క్రీడల్లో కూడా మెరుగైన ఫలితాలు సాధించడం ద్వారా జిల్లాకు మంచిపేరు తీసుకురావాలన్నారు. ఇందులో భాగంగా శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. భారత్ క్రికెట్ జట్టు మాజీ మేనేజర్ పప్పు సింగ్ నేతృత్వంలో శిబిరాన్ని నిర్వహిస్తున్నమన్నారు. కార్యక్రమంలో కోచ్ ప్రీతమ్ జిత్ దాస్, సూరాబ్ సైగల్, మల్కన్‌గిరి జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎండీ ఫారుక్, జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి హృదానాంద్ సాహు పాల్గొన్నారు.

పనస కాయల లోడ్ వ్యాన్ బోల్తా : గిరిజన మహిళ మృతి

- రంగబయలు పంచాయతీ కోసంపుట్టు ఘాట్‌రోడ్డులో ఘటన



బొలెరో పికాప్ కింద కిల్లో కుమ్మి(42) మృతదేహం



కోసంపుట్టు ఘాటీలో బోల్తా పడి ఉన్న పనసకాయల లోడుతో ఉన్న బొలెరో పికాప్ వాహనం..

ముంచంగిపుట్టు (అల్లూరి జిల్లా): మండలంలో రంగబయలు పంచాయతీ కోసంపుట్టు గ్రామ సమీపంలో గల ఘాట్‌రోడ్డులో పనసకాయల లోడుతో వెళుతున్న వ్యాన్ బ్రేకులు ఫెయిల్ అవడంతో అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఒడిశా రాష్ట్రం కొరాపుట్ జిల్లా నందపూరు బ్లాక్ తుభ గ్రామానికి చెందిన గిరిజన మహిళ కిల్లో కుమ్మి(42) మృతి చెందింది. వివరాలు ఇలా ఉన్నాయి. ఒడిశా రాష్ట్రానికి చెందిన వ్యాపారులు ఆదివారం రంగబయలు పంచాయతీ కోసంపుట్టు, పట్నుపడాల్‌పుట్టు, జోడిగుమ్మ గ్రామాల్లో పనసకాయలను కొనుగోలు చేసి, వ్యాన్‌లో లోడు చేసుకొని వస్తుండగా కోసంపుట్టు ఘాట్‌రోడ్డు ఎక్కుతుండగా ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో వ్యాన్ వెనుక ఉన్న కిల్లో కుమ్మి అనే మహిళ కింద పడిపోయింది.ఆమె మీద వ్యాన్ బోల్తా పడింది. వాహనం కింద నలిగిపోయి మహిళ మృతి చెందింది. వ్యాన్ డ్రైవర్,పనసకాయల కొనుగోలుదారులు అక్కడ నుంచి పరారయ్యారు. స్థానికులు ఎంత ప్రయత్నించినా వ్యాన్ కింద నుంచి మహిళ మృతదేహాన్ని బయటకు తీయలేకపోయారు. స్థానిక ఎంపీటీసీ సిరగం భాగ్యవతి సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించి,వివరాలు సేకరించారు. మృతురాలి కుటుంబ సభ్యులకు ఫోన్‌లో సమాచారం అందించారు. వాహనం ఎక్కడిది,పనసకాయల కొనుగోలు దారులు ఎక్కడివారు అనేది తెలియాల్సి ఉంది.గత రెండు నెలల వ్యవధిలో కోసంపుట్టు ఘాట్‌రోడ్డులో మూడు సార్లు వాహనాలు బోల్తా పడినట్లు స్థానికులు తెలిపారు.ఈ సంఘటనపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని, వివరాలు సేకరించి కేసు నమోదు చేస్తామని ఎస్ఐ రామకృష్ణ తెలిపారు.

ఝివురీ అడ్డగింతపై ఆందోళన



ఆందోళనకు నేతృత్వం వహించిన మాజీ మంత్రి పద్మిని దియానతో నేతలు

జయపురం: జయపురం సబ్‌డివిజన్ కొట్‌పాడ్ సమితి చత్తీస్‌గఢ్ సరిహద్దున గల ఝివురి నది ముందు అడ్డంగా వేసిన ఇసుక బస్తాలు వెంటనే తొలగించాలని బీజేడీ శ్రేణులు చత్తీస్‌గఢ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాయి. వందలాది మంది కార్యకర్తలు, బిజేడి నాయకులు ఆదివారం ఝివురి నదీ ప్రాంతాన్ని సందర్శించారు. 2003లో కుదుర్చుకున్న ఒప్పందాన్ని ఉల్లంఘించడం తగదని అన్నారు. మాజీ మంత్రి పద్మిని దియాన్ అధ్యక్షతన నిర్వహించిన ఝివురి బచావ్ అభిజాన్ సభలో మాజీ మంత్రి రబినారాయణ నందో మాట్లాడుతూ ఝివురి నది నుంచి నీటిని మళ్లించే ప్రయత్నం చేస్తున్నారని, అలా చేస్తే కొరాపుట్ ప్రజలు మౌనంగా ఉండబోరని అన్నారు. గతంలో ఉభయ ప్రభుత్వాలు చేసుకున్న ఒప్పందాన్ని పక్క రాష్ట్రం ఉల్లంఘిస్తోందని అన్నారు. ఇసుక బస్తాలు తొలగించేంత వరకు బీజేడీ పోరాడుతుందని స్పష్టం చేశారు. సభలో కొట్‌పాడ్ మాజీ ఎమ్మెల్యే చంద్రశేఖర మరిఝ, జిల్లా పరిషత్ సభ్యులు త్రిపతి చలాన్, కొట్‌పాడ్ సమితి ఉపాధ్యక్షుడు బాబులి పాణిగ్రహి, కొరాపుట్ కేంద్ర సహకార బ్యాంక్ అధ్యక్షుడు ఈశ్వరచంద్ర పాణిగ్రహి, ఉపాధ్యక్షుడు దురుపుత భొత్ర, సీనియర్ బీజేడీ నేతలు పద్మన్ బిశాయి, మహమ్మద్ సలీమ్, లక్ష్మీపూర్ మాజీ ఎమ్మెల్యే ప్రభుజానితో పాటు వందలాది మంది స్థానిక బీజేడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

వామ్మో.. వానర సైన్యం!



గూడేం గ్రామంలో ఇళ్లపై సంచరిస్తున్న వానరాలు



కోతుల కోసం గ్రామస్తులు ఏర్పాటు చేసుకున్న బోను



వానరాలతో నష్టానికి గురవుతున్న మామిడి తోటలు

- బెంబేలెత్తిపోతున్న గూడేం గ్రామస్తులు
- గుంపులుగా తిరుగుతున్న కోతులు
- మామిడి, మునగ, మొక్కజొన్న పంటలు నాశనం

టెక్కలి : గూడేం.. టెక్కలి మండలంలోని ఈ గ్రామం పేరు వినగానే మొదటగా గుర్తుకు వచ్చేది కార్గిల్ పోరాట యోధులే. పలువురు సైనికులు అప్పటి యుద్ధంలో పాల్గొని గ్రామానికి పేరు ప్రఖ్యాతలు తీసుకొచ్చారు. ఇదే గ్రామం మామిడి పంటకు సైతం ప్రసిద్ధి. ఇక్కడి మామిడిపండ్లకు ఇతర రాష్ట్రాల్లో ఎంతో గిరాకీ. అటువంటి గూడేం గ్రామస్తులకు ఇప్పుడు వానరాల గుంపు కంటికి కునుకులేకుండా చేస్తున్నాయి. ఎక్కడి నుంచి వస్తున్నాయో తెలియదు గానీ గుంపులుగా సంచరిస్తూ పంటలను నాశనం చేస్తున్నాయి. మామిడి పంటలు, మునగ, మొక్కజొన్న పంటలను నాశనం చేస్తున్నాయి. ఇళ్లల్లో చొరబడి అకస్మాత్తుగా దాడులకు తెగబడుతున్నాయి. గత కొన్ని నెలలుగా ఇదే పరిస్థితి ఉండటంతో గ్రామస్తులు భయాందోళనతో బిక్కుబిక్కుమంటున్నారు. ఏటా మామిడి పంటతో లాభాలను చవిచూస్తున్న తమకు ఈ ఏడాది ఈ కోతుల బెడద వల్ల ఇప్పటికే తీవ్రమైన నష్టం వాటిల్లిందంటూ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంత జరుగుతున్నా అటవీశాఖాధికారులు కనీస చర్యలు చేపట్టడం లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా అటవీ శాఖాధికారులు స్పందించి గ్రామంలో కోతుల బెడద లేకుండా చూడాలని కోరుతున్నారు.



కోతుల బెడదతో బిక్కుబిక్కుమంటున్న గూడేం గ్రామం



ఇళ్లపై ముళ్ల కంపలు వేస్తున్న గ్రామస్తుడు

ఇళ్లల్లో చొరబడి దాడి..



మా ఊరిలో ఎప్పుడూ ఇటువంటి కోతుల ఇబ్బంది ఉండేది కాదు. ఎక్కడ నుంచి వచ్చాయో తెలియదు. గుంపులుగా తిరుగుతూ ఇళ్లల్లో చొరబడి దాడులు చేస్తున్నాయి. కొంతమందిపై దాడులు చేస్తున్నాయి. ఇళ్లపై ముళ్ల కంపలు వేసుకోవాల్సి వస్తోంది.

– జి.అమ్మాయమ్మ, గూడేం, టెక్కలి మండలం

కాపలా కాస్తున్నాను...



మా ఊరిలో కోతులు తిరుగుతూ మామిడితో పాటు మిగిలిన పంటలపై దాడులు చేస్తున్నాయి. మా గ్రామానికి చెందిన రైతు వేసిన మొక్కజొన్న పంటకు కోతులతో ఇబ్బందులు లేకుండా కాపలా కాస్తున్నాను.

– డి.భాస్కరరావు, గూడేం, టెక్కలి మండలం

ఆశలు ఆవిరి..



కోతుల బెడద వల్ల ఈఏడాది మామిడి పంటపై ఆశలు వదులుకోవాల్సి వస్తోంది. ఇప్పటికే పూత కనిపించక ఆందోళన చెందుతుంటే ఇప్పుడీ కోతుల బెడద. అటవీ శాఖ అధికారులు చర్యలు చేపట్టాలి.

– టి.పీతాంబరం, మామిడి రైతు, గూడేం, టెక్కలి మండలం.

‘ప్రసాద్’ నిధుల కోసం ప్రయత్నాలు



మంత్రి అచ్చెన్నాయుడుకు ఆదిత్యుని జ్ఞాపికను అందజేస్తున్న ఈవో భద్రాజీ, శంకరశర్మ తదితరులు

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో అభివృద్ధి పనుల కోసం ఇంకా ఎలాంటి ఫాలోఅప్ చేయకపోవడంపై తనకు అసంతృప్తిగా ఉందని రాష్ట్ర మంత్రి కె.అచ్చెన్నాయుడు అన్నారు. ఆదివారం కుటుంబసమేతంగా అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయాన్ని సందర్శించారు. ఈవో వై.భద్రాజీ, ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మలు స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించారు. ఈ సందర్భంగా మంత్రి విలేకరులతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రాగానే రథసప్తమి ఉత్సవాలను రాష్ట్ర పండుగగా అంగరంగ వైభవంగా నిర్వహించామని, ఇందుకోసం ఆలయం ముందర నిర్మాణాలన్నీ యుద్ధ ప్రాతిపదికన కూల్చివేసి.. అద్భుతంగా అభివృద్ధి పనులు చేపట్టాలని భావించామని, తర్వాత ఫాలో అప్ సరిగ్గా లేకపోవడంతో పనులు ప్రారంభించలేకపోయామని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం ‘ప్రసాద్’ స్కీం మంజూరు కోసం ప్రయత్నాలు కొనసాగిస్తున్నామని.. ఆ నిధులు వచ్చేవరకు భక్తులకు తాత్కాలికంగా సౌకర్యాల కోసం ఏర్పాట్లు చేయాలని, ఇందుకోసం కలెక్టర్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించనున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే గొండు శంకర్, మంత్రి సోదరుడు హరిప్రసాద్, టీడీపీ ఇన్‌చార్జిలు తెలుగు నాగరత్నం, ఉంగటి రమణమూర్తి, ఉంగటి పాపారావు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఘనంగా ద్విగళ అష్టావధానం



అవధానులను సన్మానిస్తున్న ఎమ్మెల్సీ విక్రాంత్ తదితరులు

పాలకొండ: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం శ్రీ సూర్యచంద్ర కళాసాహితి ఆధ్వర్యంలో ద్విగళ అష్టావధానం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ విక్రాంత్ పాల్గొని అవధాని బంకుపల్లి రమేష్ శర్మ, అవధాన చంద్రమస శతావధాని చంద్రశేఖర శర్మ, అవధాన చంద్రమస శతావధాని సాయికుమార్ శర్మలను సన్మానించారు. విశ్వావసు నామసంవత్సర ఉగాది సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కణపాక చౌదరినాయుడు, సింహచలాచార్య, బౌరోతు శంకరరావు, దిలీప్‌కుమార్, సాహితి శ్రీనివాసరావు, వెలమల మన్మథరావు, కడగల రమణ, గారాల సూర్యం తదితరులు పాల్గొన్నారు.

ఖేలో ఇండియా పారా గేమ్స్‌లో రజతం



లలిత

విజయనగరం: ఢిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియం వేదికగా భారత ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న రెండవ ఖేలో ఇండియా పారా గేమ్స్‌లో ఉమ్మడి విజయనగరం జిల్లాకు చెందిన కిల్లక లలిత సిల్వర్ మెడల్ కైవసం చేసుకుని జిల్లా పేరు మరోసారి మారు మోగించిందని పారా స్పోర్ట్స్ అసోసియేషన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు కె.దయానంద్ తెలిపారు. ఈ పోటీల్లో దేశ వ్యాప్తంగా అన్ని రాష్ట్రాల నుంచి 1200 మంది వరకు పారా క్రీడాకారులు పాల్గొన్నారని, టి-11 కేటగిరికి సంబంధించి 400 మీటర్ల పరుగు పందెంలో గట్టి పోటీ నెలకొన్నప్పటికీ లలిత అసామాన్య ప్రతిభ కనబరిచి సిల్వర్ మెడల్ సాధించడం అభినందనీయమని, ఇది జాతీయస్థాయిలో జిల్లాకు దక్కిన గౌరవమన్నారు. లలిత ను పారా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు గోనుగుంట్ల కోటేశ్వరరావు, రాష్ట్రకార్యదర్శి వి. రామస్వామి, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (శాప్) చైర్మన్ అనిమిని రవినాయుడు, కలెక్టర్ డాక్టర్. బీఆర్. అంబేడ్కర్, జిల్లా క్రీడాభివృద్ధి అధికారి వెంకటేశ్వరరావులు అభినందించారని తెలియజేశారు.

సీనియార్టీ జాబితా తయారీకి ఏకీకృత విధానం తప్పనిసరి

పార్వతీపురంటౌన్: వివిధ జిల్లాలకు చెందిన విద్యాశాఖాధికారులు సీనియార్టీని రూపొందించడంతో ఒకే నిర్దిష్ట నియమాలు అనుసరించకపోవడం వల్ల అనేక పొరపాట్లు జరుగుతున్నాయని ఏపీటీఎఫ్ పార్వతీపురం మన్యం జిల్లా కార్యదర్శి ఎస్. బాలకృష్ణ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఉమ్మడి విజయనగరం జిల్లాలో ఉపాధ్యాయుల సీనియార్టీ జాబితాలు, రిజర్వేషన్ రోస్టర్ పాయింట్‌ల ప్రకారం రూపొందించారని, బదిలీలకు రిజర్వేషన్లు వర్తించవు కాబట్టి బదిలీలు కోరుకునే ఉపాధ్యాయులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు. బదిలీల్లో వ్యక్తిగతంగా ప్రిఫరెన్షియల్ కేటగిరీ, పనిచేసే పాఠశాల హెచ్ఆర్ఏ, పూర్తి సర్వీసు తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని పాయింట్లు కేటాయిస్తారన్నారు. బదిలీల పాయింట్లు సమానంగా వస్తే వయస్సును బట్టి సీనియార్టీ నిర్ణయిస్తారని పేర్కొన్నారు. వివిధ జిల్లాల విద్యాశాఖాధికారులు సీనియార్టీ రూపొందించడంలో ఒకే నిర్దిష్ట నియమాలు అనుసరించకపోవడం వల్ల పొరపాట్లు జరుగుతున్నాయని, వాటిని సవరించే విధంగా స్పష్టమైన ఆదేశాలు రాష్ట్ర ప్రభుత్వం జారీ చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు.

సంగీత, సాహిత్యాలతో పైడితల్లికి ఘనంగా నీరాజనం

- శ్రీపైడిమాంబ కళానికేతన్ ఆధ్యాత్మిక సేవా సంఘం వ్యవస్థాపకుడు పాత్రో

విజయనగరం టౌన్: శ్రీ పైడిమాంబ కళానికేతన్ ఆధ్యాత్మిక సేవా సంఘం 27వ వార్షికోత్సవాన్ని ఏప్రిల్ 22న గురజాడ కళాభారతిలో నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తిచేసినట్లు సంస్థ వ్యవస్థాపకుడు ఆర్.సూర్యపాత్రో పేర్కొన్నారు. ఈ మేరకు స్థానిక సంఘం కార్యాలయం ఆవరణలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సంగీత, సాహిత్య కార్యక్రమాలతో పైడితల్లి అమ్మవారికి ఘనంగా నీరాజనాలర్పిస్తూ కార్యక్రమాలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. అదే రోజు అమ్మవారి భక్తిగీతాలపపై భజన సీడీలను ఆవిష్కరిస్తామన్నారు. సంస్థ గౌరవాధ్యక్షుడు, ప్రముఖ సాహితీవేత్త నాలుగెస్సుల రాజు మాట్లాడుతూ పైడిమాంబ కళానికేతన్ సంస్థ 27వ వార్షికోత్సవానికి ప్రముఖులతో పాటు, పలువురు పెద్దలు హాజరుకానున్నారన్నారు. ఆ రోజు వేకువజామునుంచి అమ్మవారికి ప్రత్యేకపూజలు నిర్వహిస్తామని తెలిపారు. అనంతరం నిర్వహించే సభా కార్యక్రమంలో పలువురిని సముచితరీతిలో సత్కరిస్తామన్నారు.

ఉపశమనం ఇచ్చిన చిరు జల్లులు

భామిని: మండలంలో పలు ప్రాంతాల్లో ఆదివారం సాయంత్రం కురిసిన చిరు జల్లులతో వాతావరణం కాస్త చల్లబడింది. రోజంతా మబ్బులు పట్టి సాయంకాలానికి చిరు జల్లులు కురవడంతో ప్రజలు ఉక్కపోత నుంచి ఉపశమనం పొందారు. కొద్ది రోజులుగా ఎండలు మండిపోతున్నాయి. ఈ సమయంలో కురిసిన వర్షం వాతావరణాన్ని చల్లబరిచింది.

అప్రమత్తంగా లేకుంటే అక్షయం

- క్షయ వ్యాధి లక్షణాలు కనిపించిన వెంటనే కఫం పరీక్ష చేయించాలి
- 60 ఏళ్లు దాటిన వారు, పొగ తాగేవారికి పరీక్ష అవసరం
- 100 రోజుల క్షయ కార్యక్రమంలో 861 కొత్త కేసులు గుర్తింపు
- నేడు ప్రపంచ క్షయ దినోత్సవం



విజయనగరం క్షయ నివారణ కేంద్రంలో సిబినాట్ మిషన్‌లో కఫం పరీక్షిస్తున్న ల్యాబ్ టెక్నీషియన్

విజయనగరం ఫోర్ట్: ఒకరి నుంచి మరొకరికి త్వరగా వ్యాప్తి చెందే అంటువ్యాధి క్షయ. క్షయ వ్యాధిని ఎంత త్వరగా గుర్తిస్తే అంత మంచిది. దీని వల్ల వ్యాధి వ్యాప్తిని తగ్గించడానికి అవకాశం ఉంటుంది. సోమవారం ప్రపంచ క్షయ దినోత్సవం సందర్భంగా సాక్షి అందిస్తున్న ప్రత్యేక కథనం. క్షయ వ్యాధిని గుర్తించి 6 నెలల పాటు మందులు వాడడం ద్వారా వ్యాధిని పూర్తిగా నివారించవచ్చు. అయితే వ్యాధి పట్ల నిర్లక్ష్యం చేస్తే మృత్యువాత పడే ప్రమాదం ఉంది. వ్యాధి లక్షణాలు ఉన్నప్పటికీ కొంతమంది నిర్లక్ష్యం చేస్తుంటారు. అటువంటి వారికి ప్రాణాలు మీదికి వస్తుంది. తగు జాగ్రత్తలు పాటించడం ద్వారా వ్యాధి బారిన పడకుండా ఉండవచ్చు.

వ్యాధి లక్షణాలు:

రెండు వారాలకు మించి దగ్గు, రెండు వారాలకు మించిన జ్వరం, ఆకలి మందగించడం, బరువు తగ్గడం, ఛాతీలో నొప్పి, కఫంలో రక్తపు జీరలు రావడం, రాత్రి పూట చెమటలు పట్టడం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, ఆలసటగా ఉండటం, మెడ వద్ద వాపులు క్షయ వ్యాధి లక్షణాలు. మైక్రో బాక్టీరియా చుబర్‌క్యూలోసిస్ అనే బాక్టీరియా వల్ల గాలి ద్వారా ఈ వ్యాప్తి చెందుతుంది. రోగి దగ్గినప్పుడు ఉమ్మి తుంపర్ల ద్వారా కూడా వ్యాధి వ్యాప్తి చెందుతుంది.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు:

క్షయ వ్యాధి రాకుండా ఉండాలంటే చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి. ముఖ్యంగా ధూమపానం, మద్యపానం, సురక్షితం కాని లైంగిక సంబంధాలు వంటి వాటికి దూరంగా ఉండాలి. క్షయ వ్యాధి నిర్ధారణ అయితే వెంటనే మందులను పూర్తి కాలం పాటు వాడాలి. సాధారణ క్షయ వ్యాధికి 6 నెలల పాటు, మద్యలో మానివేసి తిరిగి ప్రారంభిస్తే 8 నెలల పాటు, మొండి క్షయ వ్యాధికి రెండేళ్ల పాటు మందులు వాడాలి. అలా కాకుండా మందులను మధ్యలో మానివేస్తే రోగ నిరోధక శక్తి క్షీణించి మృత్యువాత పడే ప్రమాదం ఉంది.

వ్యాధిలో రకాలు

క్షయ వ్యాధి వెంట్రుకలు, గోళ్లకు తప్ప శరీరంలోని ఏ ఇతర అవయవానికైనా వస్తుంది. ఈ వ్యాధి 35 నుంచి 50 ఏళ్ల వయసు గల వ్యక్తుల్లో ఎక్కువగా వ్యాప్తి చెందుతుంది. ఊపిరితిత్తులకు సంబంధించి అధికశాతం మందికి వస్తుంది. గర్భాశయం, చర్మం, ఎముకలు, కళ్లకు వచ్చే క్షయ వ్యాధిని ఎక్స్‌ట్రా పలమనరీ టీబీ అంటారు. ఈ వ్యాధి ఎక్కువగా హెచ్ఐవీ, మధుమేహం, రక్తహీనత, పౌష్టిహాకరం లోపం ఉన్న వారికి వచ్చే అవకాశం ఉంది.

జిల్లాలో 34 కేంద్రాలు

రెండు వారాలకు మించి దగ్గు, జ్వరం, చాతీలో నొప్పి, బరువుతగ్గడం వంటి క్షయ వ్యాధి లక్షణాలు ఉంటే సమీపంలో ఉన్న కఫం పరీక్ష కేంద్రానికి వెళ్లి పరీక్ష చేసుకోవాలి. జిల్లాలో కఫం పరీక్ష కేంద్రాలు 34 ఉన్నాయి. అదేవిధంగా టీబీ యూనిట్లు 14 ఉన్నాయి. వాటిలో ఏ కేంద్రానికి వెళ్లినా ఉచితంగా పరీక్ష చేసి ఉచితంగా మందులు అందజేస్తారు.

పార్వతీపురం మన్యం జిల్లాలో 1451 క్షయ కేసులు



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా క్షయ నియంత్రణ అధికారి డాక్టర్ ఎం.వినోద్

పార్వతీపురంటౌన్: పార్వతీపురం మన్యం జిల్లాలో 20 పంచాయతీలను క్షయ రహిత పంచాయతీలుగా ఎంపిక చేసి జిల్లాలో 49 డిజిగ్నేటెడ్ మైక్రోస్కోప్ సెంటర్లు, 7 టీబీ యూనిట్లను ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాల్లో 2024 జనవరి నుంచి డిసెంబర్ వరకు 1451 మందికి క్షయ పాజిటివ్‌గా గుర్తించారు. వారిలో 1117 మందికి చికిత్స పూర్తి చేశారు. జనవరి 2025 నుంచి ఇప్పటివరకు 507 మందిని గుర్తించి వారికి చికిత్స అందించారు.

700 మంది పౌష్టికాహారం కిట్లు

ప్రస్తుతం జిల్లాలో ఏడు వందల మంది పౌష్టికాహారం కిట్లు పొందుతున్నారని జిల్లా క్షయ నియంత్ర అధికారి డాక్టర్ ఎం.వినోద్ తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చే వారిలో కనీసం 10 నుంచి 15 శాతం మందికి కఫం పరీక్షలు చేయాలని ఆదేశించామని చెప్పారు. ఏఎన్ఎం, ఆశ కార్యకర్తలు క్షయరోగులను పరామర్శించి, మందులు వేసుకుంటున్నారో లేదో గమనించడమే కాకుండా ప్రతి రెండు నెలలకు ఒకసారి 'కఫం' పరీక్షకు పంపించాలని సూచించినట్లు చెప్పారు.

క్షయ పరీక్ష చేసుకోవాల్సిన వారు:

60 ఏళ్లు దాటిన వారు, సుగర్ వ్యాధి గ్రస్తులు, మద్యం, పొగతాగేవారు. గతంలో క్షయ వ్యాధి మందులు వాడిన వారు, క్షయ వ్యాధి మందులు వాడిన వారి కుటుంబసభ్యులు, ఎత్తుకు తగ్గ బరువు లేని వారు, క్షయ వ్యాధి నిర్ధారణ పరీక్ష చేయించుకోవాలి.

861 కేసులు గుర్తింపు:

జిల్లాలో 100 రోజుల టీబీ కార్యక్రమాన్ని 2024 డిసెంబర్ 7 నుంచి మార్చి 23 వరకు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 5,59,899 మందిని స్క్రీనింగ్ చేసి 43,413 మందికి వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేశారు. 33, 637మందికి ఎక్స్‌రే తీయగా 861 క్షయ కేసులు నమోదయ్యాయి.

పూర్తిస్థాయిలో నిర్మూలనకు కృషి



క్షయ వ్యాధిని పూర్తిస్థాయిలో నిర్మూలించడానికి కృషి చేస్తున్నాం. అందులో భాగంలో జిల్లాలో 100 రోజుల టీబీ కార్యక్రమాన్ని నిర్వహించాం. ప్రజలకు క్షయ వ్యాధిపై విస్తృత అవగాహన కల్పించాం. గ్రామాలకు వెళ్లి క్షయ వ్యాధి నిర్ధారణ పరీక్షలు, ఎక్స్‌రేలు తీశాం. క్షయ వ్యాధి నిర్ధారణ అయిన వారికి పౌష్టికాహారం నిమత్తం రూ.1000 చొప్పున అందిస్తున్నాం. జిల్లాను 10 టీబీ యూనిట్లుగా విభజించి చర్యలు తీసుకుంటున్నాం.

డాక్టర్ కె.రాణి, జిల్లా క్షయ నివారణ అధికారి

వాగ్దేవి సమారాధనం సంస్థ వార్షికోత్సవానికి సర్వం సిద్ధం

- సంస్థ వ్యవస్థాపక అధ్యక్షురాలు డాక్టర్ పెన్నేటి స్వప్న హైందవి



విశ్వావసునామ ఉగాది పురస్కార గ్రహీతల వివరాలు వెల్లడిస్తున్న డాక్టర్ పెన్నేటి స్వప్న హైందవి, తదితరులు

విజయనగరం టౌన్: విద్యలనగరం విజయనగరంలో శ్రీ పైడితల్లి అమ్మవారి దివ్యాశీస్సులతో సంస్కృతి, సంప్రదాయ పరిరక్షణకు వేద సంస్కృతాంధ్ర భాషలలో ఎవరైతే స్థానికంగా విశేష కృషిచేసి ఉంటారో అటువంటి పెద్దలను సముచిత రీతిలో సంస్థ వార్షికోత్సవం రోజున సత్కరించుకునేందుకు ఏర్పాట్లను సిద్ధం చేసినట్లు వాగ్దేవి సమారాధనం సంస్థ వ్యవస్థాపక అధ్యక్షురాలు డాక్టర్ పెన్నేటి స్వప్న హైందవి పేర్కొన్నారు. ఈ మేరకు స్థానిక ధర్మపురి రోడ్డులో ఉన్న సంస్థ ఆవరణలో ఆదివారం వివరాలు వెల్లడించారు. ఉగాది పర్వదినం, సంస్థ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని డాక్టర్ దార్లపూడి శివరామకృష్ణకు వాగ్దేవి సాహిత్య ద్రష్ట అనే పురస్కారంతో, డాక్టర్ బొంతు గురవయ్యకు వాగ్దేవి వరపుత్ర పురస్కారంతో సత్కరించుకుంటున్నామని తెలిపారు. సంస్థ ప్రధానకార్యదర్శి డాక్టర్ నాగమల్లిక మా ట్లాడుతూ గురజాడ గ్రంథాలయంలో విశ్వావసునామ సంవత్సర ఉగాది రోజున ఉదయం 10 గంటల నుంచి నిర్వహించే కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సాహిత్య పర్యవేక్షకులు సాహితి, రుగ్వేదాచార్యులు రాంభట్ల సన్యాసిరాజు, శంబర కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

లారీ ఢీకొని భార్యాభర్తల మృతి



సంఘటనా స్థలంలో మజ్జి రాము, గురిబారి మృతదేహాలు

సాలూరు: మండలంలోని నెలిపర్తి పంచాయతీ వంగర గుడ్డివలస గ్రామానికి చెందిన భార్యాభర్తలు సాలూరు పట్టణంలో లారీ ఢీకొనడంతో జరిగిన ప్రమాదంలో అక్కడికక్కడే మృతిచెందారు. ఆదివారం జరిగిన ఈ సంఘటనపై సీఐ అప్పలనాయుడు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వంగర గుడ్డివలస గ్రామానికి చెందిన భార్యాభర్తలు మజ్జి రాము(51), గురిబారి(47)లు సాలూరు పట్టణానికి వచ్చి సొంత పనులు ముగించుకుని ఆదివారం రాత్రి ద్విచక్రవాహనంపై స్వగ్రామానికి బయల్దేరారు. ఈ క్రమంలో పట్టణంలో బైపాస్ రోడ్డు వై జంక్షన్ వద్ద వారి బైక్‌ను ఒడిశా నుంచి వస్తున్న లారీ ఢీకొట్టింది. దీంతో భార్యాభర్తలు అక్కడికక్కడే మృతిచెందారు. ఈ ప్రమద ఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.కాగా ఆ భార్యాభర్తలు విజయవాడలో వలస పనులకు వెళ్లి ఇటీవలే తమ స్వగ్రామానికి వచ్చినట్లు తెలియవస్తోంది.

గురుకులాలు, కళాశాలల్లో సీసీ కెమెరాలు

- సజావుగా పదోతరగతి పరీక్షలు
- గురుకులాల రాష్ట్ర కార్యదర్శి వీఎస్ మస్తానయ్య



గురుకులాన్ని పరిశీలిస్తున్న కార్యదర్శి మస్తానయ్య

బొబ్బిలి: రాష్ట్రంలోని 50 గురుకులాలు, మరో పది కళాశాలల్లో సీసీ కెమెరాలతో భద్రత కట్టుదిట్టం చేయనున్నట్లు గురుకులాల రాష్ట్ర కార్యదర్శి వీఎస్ మస్తానయ్య తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన బొబ్బిలిలోని గురుకులాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ ఒక్కో గురుకులానికీ 8 చొప్పున మొత్తం 480 కెమెరాలను అమర్చేందుకు సంబంధిత వ్యక్తులతో మాట్లాడామని, త్వరలోనే కెమెరాలను అమర్చనున్నట్లు చెప్పారు. గురుకులాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడం వల్ల పర్యవేక్షణ సులువవుతుందన్నారు. అన్ని విభాగాలను అనుసంధానం చేస్తూ సీసీ కెమెరాల ద్వారా ప్రిన్సిపాల్స్, పీఈటీ, పీడీలు విద్యార్థులకు క్రమశిక్షణను మరింత మెరుగుపర్చేందుకు వీలవుతుందన్నారు. బొబ్బిలి గురుకులానికి ప్రహరీ, కంచెల నిర్మాణం ఒక కొలిక్కి వచ్చిందన్నారు. ఇప్పటికే ప్రహరీ దాదాపు పూర్తి కావచ్చిందని, త్వరలో మిగిలిన కొద్దిపాటి భాగం కూడా దాతల సాయంతో నిర్మాణం చేయనున్నట్లు చెప్పారు. మన బడి నాడు-నేడులో భాగంగా కొన్ని భవనాలు నిర్మించగా మిగిలిన పాత భవనాలను తొలగించాల్సి ఉందన్నారు. అలాగే గురుకులాల్లో రెసిడెన్షియల్ అనే పదానికి విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు కూడా స్థానికంగా ఉండాల్సిందేనని స్పష్టం చేశారు. అందుకోసం ఇక్కడ సిబ్బంది నివాస గృహాల నిర్మాణం కావాల్సి ఉందన్నారు. ప్రస్తుతం నిధుల సమస్య ఉన్న కారణంగా పాత డార్మిటరీలను ఆధునీకరించి కొద్దిమంది సిబ్బందినైనా స్థానికంగా ఉండేందుకు వీలుగా నిర్మాణాలు చేయనున్నామని తెలిపారు. దీనిపై అక్కడికక్కడే సంబంధిత ఈఈతో ఫోన్‌లో మాట్లాడారు.

కళాశాలగా ఎచ్చెర్ల గురుకులం

శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల సమీపంలోని ఎస్ఎం పురంలో ఉన్న గురుకులాన్ని కళాశాలగా అప్‌గ్రేడ్ చేసేందుకు ప్రతిపాదించామని చెప్పారు. బొబ్బిలి గురుకులాన్ని కూడా చాలా సంవత్సరాలుగా కళాశాలగా మార్చాలన్న డిమాండ్, ప్రతిపాదనలు ఉన్నందున, ఇక్కడి కమిటీలు, స్థానికులు మంత్రి, ప్రజాప్రతినిధుల ద్వారా దరఖాస్తు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఎస్ఎం పురం వద్ద ఉన్న గురుకులానికి చెందిన ప్రభుత్వ భూమి ఇప్పుడు ఆక్రమణలకు గురైనట్లు గుర్తించామన్నారు. మరో 11 ఎకరాలు మిగిలి ఉన్నందున దానిని సంరక్షించుకునేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు చేసినట్లు చెప్పారు. గురుకులాల్లో సిబ్బంది కొరతను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామని, ప్రస్తుతం గురుకులాల్లో జరుగుతున్న పదో తరగతి పరీక్షలకు తాను పరిశీలకుడిగా వ్యవహరిస్తున్నానని, పరీక్షలు ప్రశాంతంగానే జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కె.రఘునాథ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో పాడి గేదె మృతి

పార్వతీపురంటౌన్: పట్టణంలోని పార్వతీనగర్ లేఔట్ అగ్నిగంగమ్మ తల్లి ఆలయం పక్కనున్న ఖాళీ స్థలంలో మేతమేస్తున్న పాడి గేదెపై సప్‌లైతో ఉన్న ఎలక్ట్రికల్ వైరు తెగిపడడంతో గేదె అక్కడికక్కడే చనిపోయింది. ఆ గేదె విలువ సుమారు రూ.81వేలు ఉంటుందని, పూటకు ఐదు లీటర్లు చొప్పున పాలిచ్చే గేదె చనిపోవడంతో దానినే ఆధారంగా జీవిస్తున్న ఎస్. శ్రీనివాసరావు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. ప్రమాదానికి కారణమైన ఎలక్ట్రికల్ డిపార్ట్‌మెంట్ నష్టపరిహారం చెల్లించాలని కోరుతున్నాడు.

మే 1 నుంచి సాలూరు - విశాఖ పాసింజర్ రైలు!

బొబ్బిలి: సాలూరు - విశాఖ పాసింజర్ రైలు మే 1 నుంచి నడపనున్నట్టు రైల్వే వర్గాల ద్వారా తెలిసింది. ఈ రైలు రోజుకు రెండు సార్లు విశాఖ, సాలూరు మధ్య బొబ్బిలి జంక్షన్ మీదుగా నడవనుంది. చాలా ఏళ్లగా ఇక్కడ ఉన్న బొబ్బిలి రైల్ బస్సు కొన్ని ట్రిప్పులను బొబ్బిలి - సాలూరు మధ్య నడిపేవారు. నిత్యం కిక్కిరిసే ప్రయాణికులతో నడుస్తున్న ఈ రైల్‌బస్ కరోనా కారణంగా రైల్వే అధికారులు నిలిపివేశారు. అనంతరం సాధారణ రైళ్లు, ఎక్స్‌ప్రెస్‌లు, గూడ్స్ రైళ్ల పట్టాలెక్కినా రైల్‌బస్‌ను రైల్వే వర్గాలు నడపలేదు. కొన్నాళ్ల కిందట రైల్వే వర్గాలు విశాఖ, సాలూరు మధ్య బొబ్బిలి మీదుగా రైలును నడపనున్నట్టు ప్రకటించాయి. దీనికోసం రైలు ట్రాక్‌ను పటిష్టపరిచారు కూడా! చివరకి మళ్లీ వాయిదా పడింది. అయితే ఈ రైలును ఈ ఏడాది మే 1 నుంచి నడపనున్నట్టు తెలుస్తోంది. రైల్వే సాంకేతికాధికారులు సాలూరు లైన్ వద్ద ఆదివారం గేటును అమర్చారు. బొబ్బిలి నుంచి రైలు బయలుదేరిన వెంటనే రాజ్‌మహల్ వద్ద లెవెల్ క్రాసింగ్ ఉంది. ఇక్కడ క్యాబిన్‌ను కూడా నిర్మించి ఇప్పుడు గేటు కూడా ఏర్పాటు చేశారు. ఈ విషయమై రైల్వే సాంకేతికాధికారులు మే 1 నుంచి విశాఖ, సాలూరు రైలును నడపనున్నట్టు వెల్లడించారు.

ఘనంగా నృత్య కళాభారతి వార్షికోత్సవం

విజయనగరం టౌన్: భారతీయ విద్యాకేంద్ర నిర్వహణలోని నృత్య కళాభారతి ద్వితీయ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. సద్గురు శ్రీ త్యాగరాజస్వామి ఆరాధనోత్సవాన్ని నిర్వహించారు. నృత్య కళాభారతి నుంచి గుమ్చీ, శంకరమఠం, కోట మీదుగా బీవీకే పాఠశాల వరకూ తిరువీధి ఉత్సవాన్ని నిర్వహించారు. అనంతరం పాఠశాలలో త్యాగరాజస్వామి పూజాకార్యక్రమం, పంచరత్న సేవ అనంతరం త్యాగరాజ విరచిత పంచరత్న కీర్తనలను కళాకారులు ఆలపించారు. కళాశాల ఇంచార్జ్ ప్రిన్సిపాల్ ఎం.ఏడుకొండలు ఆధ్వర్యంలో నిర్వహించిన సేవా కార్యక్రమంలో మహారాజా సంగీత, నృత్య కళాశాల అధ్యక్షులు కెవివిఎల్ఎన్. శాస్త్రి పట్టణానికి చెందిన కళాకారులు ఎం.నీలాద్రిరావు, రాంచరణ్, పద్మావతి, రామచంద్ర శేఖర్, పద్మప్రియ, కళాభిమానులు తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో దేవుడి విగ్రహాల ధ్వంసం

- పునర్నిర్మాణ దశలో దుండగుల దుశ్చర్య
- బోడసింగిపేటలో ఘటన
- దుర్గాదేవి, గరుత్మంతుడు విగ్రహాల ధ్వంసం



ధ్వంసం చేసిన విగ్రహాలను పరిశీలిస్తున్న ఎస్ఐ మహేష్



దుండగుల దుశ్చర్యలో పాదాలు ధ్వంసమైన గరుత్మంతుడు విగ్రహం

బొండపల్లి: మండలంలోని బోడసింగిపేట గ్రామంలో జాతీయ రహదారి 26కు ఆనుకోని పునర్నిర్మాణంలో ఉన్న సీతారామ ఆలయంలో దేవుడి విగ్రహాలను గుర్తు తెలియని దుండగులు శనివారం అర్ధరాత్రి దాటిన తరువాత ధ్వంసం చేశారు. ఈ ఘటన స్థానికంగా చర్చనీయాంశమైంది. గ్రామంలో గతంలో ఉన్న ఆలయం శిథిలావస్థకు చేరుకోవడంతో దీన్ని పునర్నిర్మించేందుకు గ్రామస్తులంతా ఐక్యంగా శ్రీకారం చుట్టారు. పనులు కూడా తుది దశకు చేరుకున్నాయి. పెద్దాపురానికి చెందిన శిల్ప కళాకారులు ఆలయ నిర్మాణ పనులు చేస్తున్నారు. ఇంతలోనే ఆలయం వెలుపల గోడకు ఆనుకోని నిర్మాణ తుది దశలో ఉన్న దుర్గాదేవి విగ్రహంతో పాటు గరుత్మంతుడు విగ్రహాల చేతులు, కాళ్లను దుండగలు ధ్వంసం చేశారు. రోజూలాగే ఆదివారం ఉదయం పనులకు వచ్చిన శిల్ప కళాకారులు విగ్రహాలు ధ్వంసం కావడం చూసి గ్రామ పెద్దలకు విషయం తెలిపారు. సర్పంచ్ కోరాడ జానకీరాం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఎస్ఐ యు.మహేష్ ఆలయం వద్దకు చేరుకొని ధ్వంసమైన విగ్రహాలను పరిశీలించి దర్యాప్తు చేపట్టారు. ఇదిలా ఉండగా గ్రామానికి ఆనుకొని రెండు మద్యం దుకాణాలు ఉండడంతో మందుబాబులే ఇటువంటి దుశ్చర్యలకు పాల్పడి ఉంటారని గ్రామస్తులు అనుమానిస్తున్నారు. ఇదిలా ఉండగా విగ్రహాల ధ్వంసం విషయం తెలుసుకున్న రాష్ట్ర చిన్న, మధ్య తరహా, ఎన్ఆర్ఐ వ్యవహారాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఆలయానికి వచ్చి పరిశీలించారు.

ఈ వేడుక ఆదర్శం

- చెప్పడం కాదు.. చేసి చూపించారు...
- కొబ్బరి కమ్మలతో చలువ పందిళ్లు
- అరటి ఆకుల్లో భోజనాలు
- మట్టి గ్లాసుల్లో తాగునీరు



అరటి ఆకుల్లో భోజనాలు చేస్తున్న ఆహ్వానితులు

చీపురుపల్లి: మారిన ఆధునిక సమాజంలో సాంప్రదాయ పద్ధతుల నడుమ నూతన వస్త్రాలంకరణ మహోత్సవం జరిపి మిరియాల వారి కుటుంబం అందరికీ ఆదర్శంగా నిలిచింది. శభాష్ అనిపించుకుంది. వివరాల్లోకి వెళ్తే... చీపురుపల్లి పట్టణంలోని వంగపల్లిపేటకు చెందిన మిరియాల రాంబాబు, అనురాధ దంపతుల ఇంట నూతన వస్త్రాలంకరణ మహోత్సవం పేరిట ఆదివారం ఓ కార్యక్రమం నిర్వహించారు. బంధువులు, స్నేహితులను వందల సంఖ్యలో పిలిచారు. అందరూ వచ్చారు.. అక్కడ ఏర్పాట్లు చూసి ఒకింత మెచ్చుకున్నారు. వేడుకలు ఇలాగే చేస్తే పర్యావరణాన్ని కాపాడుకోవచ్చని చర్చించుకున్నారు. వేడుకలో కొబ్బరి కమ్మలతో చలువ పందిళ్లు వేశారు. అరటి ఆకుల్లో భోజనాలు పెట్టారు. మట్టి గ్లాసుల్లో నీరు పోశారు. ఆహ్వానాన్ని కూడా ఓ వస్త్రంపై రాసి ఏర్పాటు చేశారు. ప్లాస్టిక్ వద్దు... కాగితం సంచులు ముద్దు... అంటూ నిత్యం ప్రకటనలిస్తూ.. పత్రికలకు ఫొజులిచ్చే వారికి కళ్లు తెరిచేలా ఎక్కడా ప్లాస్టిక్ వస్తువును వాడకుండా వేడుక నిర్వహించి అందరి మన్ననలు పొందారు. ఎక్కడా ప్లాస్టిక్ కనిపించకుండా చేయడంతో ఇది కాస్తా వైరల్ అయ్యింది. దశాబ్దాల కిందట జరిగిన వేడుకలు గుర్తుకొచ్చేలా సాంప్రదాయంగా చేసి అందరినీ ఆకట్టుకున్నారు.